


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 5 సంచిక : 11 పుష్యం : 43-46 5-8-2000

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 24
**VOL: 5 ISSUE: 11**

CHIEF EDITOR
**P. S. RAMA RAJU**

EDITOR
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : RS. 125

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438

## సామాజిక చింతన ఆత్మ పరిశోధన అవసరం

మిలీనియం సంవత్సరం అట్టహాసంగా ప్రారంభమయింది. హైటెక్ విధానాలు, గ్రహాంతర సమాచార సేకరణ, కంప్యూటర్ యుగం రోజురోజుకు విస్తరించి మానవ అవసరాలు తీర్చటంలో పోటీపడి శాస్త్రజ్ఞులు సాధించగలుగుతున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 53 సంవత్సరములు పూర్తిచేసుకొని 54వ వసంతంలోనికి అడుగుపెట్టాం. భారతదేశం కూడా అనేక రంగాలలో అభివృద్ధి సాంధించినా ప్రజలలో సామాజిక చింతన, ఆత్మ పరిశోధన కొరవడుతున్నాయి. తనకేమి కావాలో తాపత్రయ పడుతున్న సమాజంలోని వ్యక్తులు సమాజానికి ఏమి చేయగలనో అలోచించటం లేదు. వ్యక్తి వికాసంతోపాటు, సమాజ వికాసం కూడా పెరగవలసిన అవసరం ఉంది. కర్మభూమిగా, వేదభూమిగా పేరుగాంచిన భారతావనిలో ఉగ్రవాదం పెరగటానికి కొందరు స్వార్థ చింతనే కారణమని వారిని పోషిస్తున్న కొన్ని విదేశీయ శక్తులు, భారతదేశంలో ఉన్న కొన్ని రాజకీయ శక్తులే కారణమని అనేక సంఘటనలు రుజువు చేసాయి. వాటికి దూరంగా గాంధీ కలలుగన్న శాంతి దేశంగా భారతావనిని రూపుదిద్దుకోవటానికి కంకణం కట్టుకొందాం!

.... చీఫ్ ఎడిటర్

### ఈ సంచికలో....

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

22-6-2000, జిన్నూరు ........ 2
29-6-2000, నర్సాపురం ........ 6
3-7-2000, పెదనింద్రకొలను ........ 10
16-7-2000, జిన్నూరు ........ 15

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 22-6-2000, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని మనకు సజీవమైన విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హెచ్చుతగ్గులు లేకుండా ఎప్పుడూ సమానంగా ఉండాలి. మనందరము తెగిపోయిన గాలిపటాలలాగ లేము. తెగిపోయిన గాలిపటం ఎటుగాలివీస్తే అటు వెళ్ళిపోతుంది. కాని మన జీవితాలు అలాగ లేవు. పూర్వజన్మకు, ఈ జన్మకు అనుబంధం ఉంటుంది. ఈశ్వరుడు నిర్దేశించిన దానిని బట్టి ఈ దేహం నడుస్తుంది. ఈ సృష్టిని నియమించే శక్తి ఒకటి ఉంది అని, దొంగనేను అంటూ ఏదీ లేదు అని ఎల్లవేళల మనం గుర్తుంచుకోవాలి. దొంగనేను అనేది నిజంగా లేదు. అది ఉంది అని అనుకొంటున్నాము కాబట్టి సాధన చేస్తున్నాము. ద్వైతప్రపంచం అంతాకూడా దొంగనేను మీద ఆధారపడి ఉంది. దైనందినజీవితంలో ప్రతిరోజూ కూడా ఈ రోజునా డ్యూటీ ఏమిటి అని చూసుకొంటూఉండాలి. ఈరోజు మీ అత్తగారికి ఏదైనా సేవచేయవలసి ఉంది అనుకోండి. మీ ఇష్టాయిష్టాలను ప్రక్కకు పెట్టి మీ డ్యూటీని ప్రేమగా చేయండి. ఇష్టాయిష్టాలే మనస్సును బాహ్యాముఖం చేస్తాయి. ఇష్టాయిష్టాలలోనికి వెళితే దొంగనేను పెరిగి పోతుంది. వాటిని ఒక ప్రక్కన పెట్టి మీ డ్యూటీని ప్రేమగా చేస్తున్నారు అనుకోండి దొంగనేను దానంతట అదే పడిపోతుంది. ఏమనిషికి ఇష్టమైన పనిని వాడు చేస్తూ ఉంటాడు. అందులో విశేషం లేదు. భగవంతుడు ఇది మంచిపని అని చెప్పినప్పుడు అది మనకు ఇష్టం లేకపోయినా చేయాలి.

జరిగేది ఈశ్వరసంకల్పం, అనుకొనేది జీవుడిసంకల్పం. జీవుడి సంకల్పం, ఈశ్వరుడి సంకల్పం ఒకోసారి కలుస్తూ ఉంటాయి. కలిసినప్పుడు కూడా ఈశ్వరసంకల్పమే జరుగుతుంది. కాని మనం ఏమి అనుకొంటాము అంటే అది మన తెలివితేటల వలన జరిగింది అనుకొంటాము. ఇలా అనుకోవటం వలన ప్రమాదం ఏమిటి అంటే దొంగనేను పెరిగిపోతుంది. ఆపని జరిగినా, జరగకపోయినా అది ఈశ్వరసంకల్పమే. కాని మనం ఏమి అంటాము అంటే జరిగితే మన తెలివితేటలవలన అంటాము, జరగకపోతే ఈశ్వరానుగ్రహం మనకు లేదు అంటాము. జీవలక్షణాలు ఇలా ఉంటాయి. జీవ లక్షణాలు ఉన్నవాడికి కోటిజన్మలు ఎత్తినా జ్ఞానంరాదు, నీ కంట్రోలర్ నీలోపలే ఉన్నా వాడు నీకు అందనే అందడు. ఒకవేళ వాడిని తెలుసుకోను అని నీవు అంటే వాడికి ఏమీ నష్టం లేదు నీకే నష్టం. దొంగనేను యొక్క చేష్టలను అర్థం చేసుకొని దానిని తొలగించుకొనే ప్రయత్నం చేయాలి. అది నశిస్తే ఉన్నవస్తువు నీకు వ్యక్తమవుతుంది. అప్పటివరకు శాశ్వతమైన శాంతిగాని, ఆనందంగాని, సుఖంగాని నీకు అందనే అందదు. మీకు సమాజంలో గౌరవం వస్తుంది, అగౌరవం వస్తుంది, గొప్పలు వస్తాయి, తిప్పలు వస్తాయి. తల్లి కడుపులోనుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంలోనికి వెళ్ళేవరకూ ఎవడి జీవితం సమానంగా ఉండదు.

హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి. ప్రారబ్దం ప్రకారం అవి వస్తూ ఉంటాయి. వాటిని పట్టించుకోవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. మనం చేసే పొరపాటు ఏమిటి అంటే గౌరవంతోటి తాదాప్యం పొందుతాము, అగౌరవంతోటి తాదాప్యం పొందుతాము ఈ రకంగా దొంగనేను పెరిగిపోతుంది. బాహ్యంగావచ్చే విషయాలు నీకు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు, నీకు సుఖం రావచ్చు, దుఃఖం రావచ్చు. వాటిని నెగ్‌లెట్ చేయటం ప్రాక్టీసు చెయ్యి దొంగనేను దానంతట అదే పడిపోతుంది. మానవుడు ప్రతీదానికి గుర్తింపు కోరతాడు. పంచభూతాలు ఏమీ గుర్తింపు కోరవు. పంచభూతాలు ఎలా ఉన్నాయో మనం కూడా అలా ఉండగలిగితే దొంగనేను అంటూ ఏమీ లేదు అని మనకు అర్థమవుతుంది.

ఒక చిన్న మేఘము సూర్యుడు మనకు కనబడకుండా చేయగలదు. అంతేగాని సూర్యుడికి, మేఘానికి ఏమీ సంబంధం లేదు. అలాగే నీవు నిజం అనుకొనేవి అన్నీ మిధ్యానేను కల్పితాలు. వాటికి, లోపల ఉన్న బ్రహ్మానికి ఏమీ సంబంధం లేదు. కాని లోపల ఉన్న బ్రహ్మము నీకు ఎరుకపడకుండా అడ్డువస్తున్నాయి. అందువలన మిధ్యానేనును తీసి ఒక ప్రక్కన పెడితే లోపల ఉన్న సద్వస్తువు నీకు ప్రత్యక్షంగా అనుభవంలోనికి వస్తుంది. పూర్వజన్మల నుండి వచ్చిన అలవాట్లయొక్క వేగంవలన, తలంపుల యొక్క వేగం వలన ఏ జన్మకు ఆజన్మ ఈ దేహం ఒక్కటే నిజం అనుకొంటాము ఈ దేహబుద్ధి నశించినప్పుడు వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. జిన్ను తిన్నప్పుడు, పాయసం నోట్లోపోసుకొన్నప్పుడు తియ్యగా ఉంది, చాలాబాగుంది అనుకొంటాము. నీవు శివనామం చేస్తున్నావు, కృష్ణనామం చేస్తున్నావు. నామం చేసేటప్పుడు ఆనామం అంత తియ్యగా ఉందానీకు అంటున్నారు. మనకు అంత తియ్యగా లేదు, యాంత్రికంగా చేస్తున్నాము. నీవు నామం యాంత్రికంగా చేస్తూ ఉంటే నీకు అనుభవంలోనికి రావటానికి ఆ దేవతాపురుషుడు అంత వెర్రివాడా అంటున్నారు. నీ లోపల ఉన్న వాసన తలంపుక్రింద మారాక నీకు తెలుస్తుంది. అది తలంపుక్రింద మారక ముందు కూడా నీకు ఏవాసన ఉందో ఆయనకు తెలుస్తుంది ఆయన ఈశ్వరుడు. నీవు ఈశ్వరుడిని మోసం చేయలేవు. నామంచేసేటప్పుడు హృదయపూర్వకంగా, భక్తితో, ప్రేమతో చేయాలి. ప్రారంభదశలో కొంత అలవాటు చేయాలి. తరువాత నిరంతరము లోపల ఆనామం జరిగిపోతూ ఉంటుంది. నిరంతరము మీ మనస్సు ఆ నామాన్ని పట్టుకొని ఉంటుంది కాబట్టి అక్కరలేని తలంపులు, ఆలోచనలు మీ మనస్సు లోనికి రావు. అప్పుడు మీ మనస్సుకు ఆరోగ్యం వస్తుంది, ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుంది. మిమ్మల్ని ఎక్కడకు తీసుకొని వెళ్ళాలో అక్కడకు తీసుకొని వెళ్ళేవరకు ఆనామం మిమ్మల్ని విడిచిపెట్టదు.

మీరు నన్ను తెలుసుకోండి అని కృష్ణుడు గీతలో చెపుతాడు అంటే ఆయన శరీరాన్ని తెలుసుకోమని కాదు, బ్రహ్మాన్ని తెలుసుకోమని. వసుదేవుడు కుమారుడుగా చెప్పినది కాదు

గీత ఆయన బ్రహ్మమై చెప్పాడు. నన్ను తెలుసుకోమని అంటే ఆయన బ్రహ్మమై చెప్పాడు కాబట్టి బ్రహ్మాన్ని తెలుసుకోమని చెప్పటం. అది ఎక్కడ ఉంది అంటే నీ హృదయంలోనే ఉంది. నీకు హృదయంలోనికి వెళ్ళేశక్తిలేక భగవంతుడు చెప్పినది నిజం అయినా దానిని వదిలేసి రాళ్ళలో, రప్పలలో భగవంతుని గురించి అన్వేషిస్తున్నావు. మనహృదయంలో ఒక నిజస్థితి ఉంది. కాని మన హృదయంలో నిజం ఉందనిమనకు తెలియటంలేదు. అది తెలియటానికే మహాత్ముల దర్శనం అవసరం. నీకు ఏదైనా తలంపు వచ్చినప్పడు దానిని యాక్షన్ రూపంలో పెట్టకూడదు. తలంపురూపంలో ఉంటే కొంతకాలానికి అది పోతుంది, యాక్షన్‌లో పెడితే అది బలపడిపోతుంది. నామం నిరంతరము జపించటం వలన తలంపుల తాలుక స్పృహే రాదు. ఇంక వాటిని జయించటం అనే సమస్యేలేదు వాటి అంతట అవే రాలిపోతాయి. నీ దేహం కంటే, నీ మనస్సుకంటే, నీ ఇంద్రియాలకంటే అత్యంత సమీపములో నీ హృదయంలో సద్వస్తువు ఉన్నప్పటికి అది నీకు తెలియటం లేదు. అది తెలియకపోవటానికి అనేక కారణాలు ఉండవచ్చు. ఆ కారణాలు అన్నీ అడ్డురాకుండా నామం నీకు సహకరిస్తుంది. నామం హృదయపూర్వకంగా, ప్రేమగా చేయగా చేయగా నిజస్థితి దగ్గరకు నిన్ను తీసుకొని వెళుతుంది. జాగ్రదవస్థలోనుండి నిద్రావస్థలోనికి వెళ్ళేవరకూ ఏదో తలంపు వస్తూనే ఉంటుంది. తలంపులు వచ్చినప్పడు రానియ్యి కంగారు పడకు. ఏనేనుకు ఈ తలంపు వస్తోందో చూడు. ఏనేను అయితే శరీరంతో తాదాప్యం పొందుతోందో ఆ నేనుకు ఈ తలంపు వస్తోంది కాని శరీరానికి రావటం లేదు. ఆ మొదటి తలంపును నువ్వు ఎవరు అని ప్రశ్నించటం వలన అది ఎక్కడ నుండి వస్తోందో అక్కడకు నెమ్మదిగా ఉపసంహరింపబడుతుంది. అప్పడు దానికి వచ్చే ఇతర తలంపులు కూడా నెమ్మదిగా వెనక్కి వెళ్ళిపోతాయి. ఇలా విచారణ చేయగా చేయగా మిధ్యానేను ఇతర తలంపుల నుండి వేరుపడిపోతుంది. కొంత కాలానికి అది ఏగుహలో నుండి వచ్చిందో ఆ గుహలోనికి జారిపోతుంది. మిధ్యానేను దానిమూలాన్ని ఎప్పడైతే చూసిందో అది నశిస్తుంది. అది నశించిన మరుక్షణంలో నీవు ఎవరో నీకు తెలుస్తుంది. నేను ఎవడను అని మెకానికల్‌గా చేయటంకాదు. అది నీలోపల గాఢంగా, గూఢంగా జరిగేపని. కొంతమందికి అంతర్‌దృష్టి ఉండదు. అంతర్‌దృష్టి లేనివాడికి కోటిజన్మలు ఎత్తినా ఏ సాధన చేసినా జ్ఞానం రాదు. నామం చేయటం వలన కూడా నీకు అంతర్‌దృష్టి కలుగుతుంది.

పుస్తకాలు చదవటం వలన పాండిత్యం వస్తుంది. ధనం, గౌరవం, అధికారం ఇవి అన్నీ ఎటువంటివో పాండిత్యం కూడా అటువంటిదే. ఇవి అన్నీ ప్రకృతికి సంబంధించిన విషయాలు. జ్ఞానమంటే అది కాదు. సత్యవస్తువు నీ హృదయంలోనే ఉంది. అది నీకు దూరంగా లేదు, నీకూడానే ఉంది. అది నీ స్వరూపంగా ఉంది. దేహం ఉన్నప్పడు ఉంది, దేహంలేనప్పడు అది ఉంది. ఏలోకానికి ప్రయాణం చేసినా సపోర్టుగా ఉన్నది అదే. దాని తాలుక అనుభవం పొందటం

జ్ఞానం. అంతేగాని నీ మనస్సుతో సంపాదించే విద్య జ్ఞానం కాదు. లోపల ఉన్నసద్వస్తువు తాలుక అనుభవం జ్ఞానం. అది ద్వంద్వాతీతం. మిథ్యానేను ద్వంద్వాల మధ్యన తిరుగుతూ ఉంటుంది. దానిని తీసుకొని వెళ్ళి ద్వంద్వాతీతంలో ఉంచగలిగితే, అక్కడనిలబెట్టగలిగితే వస్తువు నీకు వ్యక్తమవుతుంది. గాఢనిద్రలోనీవు ఉన్నావు. గాఢనిద్రలోనీవు ఎక్కడైతే ఉన్నావో జాగ్రదవస్థలో నీ మనస్సును తీసుకొని వెళ్ళి అక్కడ ఉంచగలిగితే అదే భక్తి అదే జ్ఞానం. స్వస్వరూపాన్ని అనుసంధానము చేయటమే భక్తి అని ఆచార్యులవారు చెప్పారు. నువ్వు ఎవరుగా ఉన్నావో అలాగ ఉండటమే భక్తి. బయట ఉన్న దేవుళ్ళను పూజిస్తున్నాము దీనివలన ప్రయోజనం ఏమిటి అంటే విగ్రహారాధన వలన నిగ్రహం వస్తుంది. మీరు అంతా మిధ్యే అని చెపుతున్నారు మరి మీరు బోధించటం, మేము వినటం ఎందుకు ఇదికూడా మిధ్యేకదా అని ఆచార్యులవారిని ఒకరు ప్రశ్నించారు. దానికి ఆచార్యుల వారు ఏమిచెప్పారు అంటే నువ్వు నిద్రపోతున్నావు అనుకో. నిద్రలో నీకు స్వప్నం వచ్చింది అనుకో. ఆ స్వప్నంలో ఒక సింహము వచ్చి నీ మీద పడినట్లు అనిపించింది అనుకో అప్పుడు నీకు ఏమి వస్తుంది అని అడిగారు. మెలుకువ వస్తుంది అని చెప్పాడు. మెలుకువ వచ్చాక ఆ సింహం నిజము అనుకొంటావా? అబద్ధం అనుకొంటావా అని అడిగారు. ఆ సింహం నిజంకాదు అని చెప్పాడు. స్వప్నంలో వచ్చిన సింహం అబద్ధమే అయినా నీకు మెలుకువ రావటానికి ఉపయోగపడింది, నా టీచింగ్ కూడా అంతే అని చెప్పారు. ఆచార్యులవారికి టీచింగ్ అంటే చాలా ఇష్టం. సబ్జక్టు బాగా అర్థం చేసుకొంటే ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. సబ్జక్టు విసుగు వచ్చేలా వినాలి. సబ్జక్టు బాగా అర్ధం చేసుకోవటంలోనే 75 శాతము సాధన అయిపోతుంది మిగిలిన 25 శాతము ప్రాక్టీసు చేస్తే వస్తువు అనుభవంలోనికి వచ్చేస్తుంది.

పూజలు, జపాలు, ధ్యానాలు చేసి దేవుడు ఉన్నాడా లేడా అని సంశయం ఉన్నవారికంటే ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉన్నవాడు ముందుబాగుపడతాడు. అందువలన విశ్వాసంలో మాత్రం ఊగిసలాట ఉండకూడదు. నువ్వు ఎవరినైతే సందేహిస్తున్నావో వాడు నీకు ఎలా తెలియబడతాడు. దేనికి ఇతరుల మీద ఆధారపడవద్దు. ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. బానిసత్వం వస్తే వారు ఎలా ఆడమంటే అలా ఆడాలి. అందువలన నీ పొట్టకు సంబంధించినంతవరకు జాగ్రత్తగా పని చేసుకొంటూ మిగతాటైము అంతా భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. నీవు ఏపని చేస్తున్నప్పటికి నీలోపల నామం సహజంగా జరిగిపోవాలి. నామబుద్ధిలోనుండి, రూపబుద్ధిలో నుండి విడుదల పొందటానికి నామం సహకరిస్తుంది. నదులు వెళ్ళి సముద్రంలో ఎలా కలుస్తాయో అలాగ ఈ నామాలు, రూపాలు, పూజలు, జపాలు, ప్రయత్నాలు, సాధనలు ఇవి అన్నీ కూడా వెళ్ళి ఒకే ఒక సత్యంలో మిళితమై పోతాయి. ఈ సాధన చేసేవాడు కూడా అందులో కరిగిపోతాడు. మనం ఇప్పుడు సత్యమైన నేనుకు దూరంగా ఉన్నాము. అసత్యమైన నేనుకు దగ్గరగా ఉన్నాము. నీవు ఏసాధన

చేసినా పూజ చేసినా, జపం చేసినా ఏ మార్గమైన నిన్ను అసత్యానికి దూరం చేయటానికే. ఆరోజుకారోజు దొంగనేనును దూరం చేయటమే వీటి అన్నింటియొక్క ప్రయోజనం. మనం లోకంలో పని చేయవచ్చు. మమకారంతో చేస్తే అసత్యానికి దగ్గరవుతాము, సత్యానికి దూరమవుతాము. అందువలన పని చెయ్యండి అది ఎలా చేయాలో తెలుసుకొని చెయ్యండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-6-2000, నర్సాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

తల్లి గర్భంలోనుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంకు వెళ్ళేవరకు మనకు బయట చూపేగాని లోచూపు ఉండదు. ఆధ్యాత్మిక అభివృద్ధికి మానవుడికి ముందు లోచూపు ఉండాలి. లోచూపు లేనివాడికి హృదయ సౌందర్యం తెలియదు. బాహ్యంగా ఉన్న శత్రువులు మనం అభివృద్ధిలోనికి రాకుండా ఆటంకపరుస్తారు. అలాగే లోపల ఉన్న శత్రువులు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాకుండా అడ్డువస్తారు. బయట శత్రువులకంటే లోపల శత్రువులు ఎక్కువ అపకారం చేస్తారు. విక్షేప దోషం, మలదోషం ఇవిలోపల ఉన్న శత్రువులు. విక్షేపదోషం ఉంటే మన మనస్సు కుదురుగా ఉండదు. శరీరం ఎక్కడ ఉంటుందో మనస్సు అక్కడ ఉండదు. ఉపాసనవలన విక్షేప దోషం తగ్గుతుంది. ఆసనాలు బాగా వేస్తున్నాము, ప్రాణాయామం చేస్తున్నాము మనస్సు స్వాధీనం లోనికి రావటం లేదు,. మామనస్సు మమ్మల్ని పరిపాలిస్తోంది గాని మేము మనస్సును పరిపాలించలేక పోతున్నాము అంటున్నారు. కేవలం ఆసనాల వలన, ప్రాణాయామం వలన అది స్వాధీనం లోనికి వచ్చేయదు. మనస్సు స్వాధీనంలోనికి రావటానికి భక్తి అవసరం, ఈశ్వరానుగ్రహం అవసరం. ఈశ్వరుని పాదాలను ఆశ్రయిస్తేనేగాని మనస్సు స్వాధీనంలోనికి రాదు. పూర్వజన్మల నుండి వచ్చిన వాసనలు, అలవాట్లు మన మనస్సులో మలదోషంగా ఉంటాయి. మనం ఒక మంచి పని చేయాలనుకొన్నా ఆపని రేపు చేద్దాము అనిపిస్తుంది, చేయగలశక్తి ఉన్నా చేయము దీనికి మలదోషం కారణం. మనం కామ్య కర్మలు చేస్తాము. కామ్య కర్మలు చేస్తే మలదోషం పెరుగుతుంది, నిష్కామకర్మ చేస్తే మలదోషం తగ్గుతుంది. స్వార్థం లేకుండా పని చేయటం వలన మలదోషం తగ్గుతుంది. ఒకో దేహానికి ఒకో పనిని భగవంతుడు నియమిస్తాడు. మనం అన్ని పనులు చేయలేము, అన్నీ మనకు తెలియవు. మనవంతుకు వచ్చిన పనిని ప్రేమతో చేస్తే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. డబ్బు సంపాదిస్తే బజారులో ఉన్న వస్తువు మనకు దొరికినట్లే. అలాగే ఈశ్వరానుగ్రహం సంపాదిస్తే లోపల ఉన్న ఆత్మమనకు దొరికినట్లే.

కొంతమంది వారి దేహం కంటే, మనస్సు కంటే, ప్రాణం కంటే క్రమశిక్షణకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. అటువంటివారు మోక్షం దగ్గరకు వెళ్ళనక్కరలేదు, మోక్షమే వారి దగ్గరకు

వస్తుంది. మన శరీరం కంటే, మనస్సు కంటే, ప్రాణం కంటే కాలం విలువైనది. డబ్బును నేను అని భగవంతుడు చెప్పలేదు. కాలాన్ని నేను అని భగవంతుడు చెప్పాడు. అందువలన కాలాన్ని మనం సద్వినియోగం చేసుకోకపోతే భగవంతుడిని అగౌరవపరచినట్లే అవుతుంది. కాలానికి ఇచ్చే ప్రాముఖ్యత మీరు ఇవ్వటం లేదు. జరిగిపోయిన రాత్రిగాని, పగలుగాని తిరిగి రాదు. డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు. అనారోగ్యం వస్తే తిరిగి ఆరోగ్యం సంపాదించుకోవచ్చు కాని కాలం తిరిగిరాదు. ఏరోజు చేయవలసిన పని ఆరోజు చేసుకోవాలి. శరీరాన్ని కాల్చివేస్తే ఇంక మనకు కనబడదు బూడిద అవుతుంది. మరి మనస్సు ఎప్పుడు బూడిద అవుతుంది. మనస్సు ఎప్పుడు బూడిద అవుతుంది అంటే మనస్సు నిండా వాసనలు ఉన్నాయి, వాసనలు లేని స్థితి మనకు వచ్చినప్పుడు అంటే అవాసనస్థితి మనకు వచ్చినప్పుడు అది కాలి బూడిద అవుతుంది. మనస్సుకు లోచూపు లేకపోవటం వలన ఏదో ఒక వాసన, ఏదో ఒక బలహీనత దానిని బయటకు తీసుకొని వచ్చేస్తుంది. నిరంతరము జపం చేసినా వాసన నశిస్తుంది. అవాసనస్థితివస్తేగాని మనస్సు నశించదు. అప్పటివరకు మనస్సుతో పోరాటం తప్పదు. కాని ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నువ్వు నిరంతరం మనస్సుతో ఉంటూ మనస్సును ఎలా జయించగలవు అంటున్నారు. గది తడిగా ఉంది అనుకో ఇంకో నాలుగు బిందెలు నీరు పోసి తడిని ఎలా ఆర్పగలవు. అలాగే నీవు అస్తమానునీ మనస్సు గురించి ఆలోచించుకొంటూ ఉంటే అది ఎలాపోతుంది, దానిని మర్చిపోతే అదిపోతుంది. నిరంతరము మనస్సు ఎటుగంతువేయమంటే అలావేస్తూ ఉంటే అది ఎలా పోతుంది అది పోదు. నువ్వు ఏదైతే అవునో దానిగురించి ఆలోచించు, నీవు ఏదైతే కాదో దాని గురించి ఆలోచిస్తావు ఏమిటి? నెగిటివ్ తింకింగ్‌లోనికి వెళ్ళకు, పోజిటివ్ తింకింగ్‌ను అలవాటు చేసుకో. మనో నాశనము గురించి నీవు ప్రయత్నం చేయనక్కరలేదు, నువ్వు మనోమూలంలో ఉండగలిగితే అది నశిస్తుంది. డైరెక్టుగా దానితో పోరాటానికి దిగవద్దు. ఎందుచేతనంటే అనేక జన్మలనుండి వాసనలను, అలవాట్లను మోసుకొనివస్తోంది. మనం చేస్తున్న సాధన తక్కువ. దానితో డైరెక్టుగా పోరాడటం కష్టం అందువలన మనస్సు గొడవ వదిలెయ్యండి. మనో మూలంలో ఉన్న నారాయణుడిని మీరు నిరంతరము స్మరించటం వలన, ఆయన గురించి శ్రవణం చేయటం వలన మనస్సు దానంతట అదే నశిస్తుంది.

గురువును గౌరవించటం వలన, గురువు చెప్పిన వాక్యాన్ని ధ్యానించటంవలన మనో నిగ్రహం కలుగుతుంది, మనస్సు దానంతట అదే స్వాధీనంలోనికి వస్తుంది. నీ మనస్సును జాగ్రత్తగా మచ్చిక చేసుకొని దానిని స్వాధీనం చేసుకొన్నావు అనుకో నీ బంధువులు, స్నేహితులు ఎవరూ చేయలేని ఉపకారం నీ మనస్సు నీకు చేసిపెడుతుంది. మనస్సులో అంత మిస్టరీ ఉంది. మనస్సు దాని మూలంలోనికి వెళ్ళటానికి అది ఇష్టపడదు. ఎందుచేతనంటే తన మూలంలోనికి వెళితే తాను నశిస్తానని దానికి తెలుసు. నీ ఆధ్యాత్మిక హృదయంలో ఒక అమృతవస్తువు ఉంది.

దానిని నీవు పట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి. దానికి అభ్యాసం ఉండాలి, వైరాగ్యం ఉండాలి. ఆ వస్తువు ఎంత లోతులలో ఉందో అంత లోతులలోనికి నీవు వెళ్ళగలగాలి. నువ్వు జ్ఞానం దాకా వెళతావు ఎందుకు అసలు ఒక మంచిపని చేయటానికి, మంచి మాట్లాడటానికి నీకు ధైర్యం ఉండాలి అని వేదం చెపుతుంది. ఇతరులు ఎవరైనా నిన్ను చెడ్డ చేయమని వత్తిడి చేసినా ఆచెడ్డ చెయ్యకుండా ఉండటానికి నీకు ధైర్యం ఉండాలి. ఈ విషయాలకే ఇంతధైర్యం కావలసినప్పుడు నీ హృదయంలో ఉన్న అమృతవస్తువును తెలుసుకోవటానికి ఇంక ఎంత ధైర్యం ఉండాలి ముందు ఇది చూసుకో, నేను చనిపోయిన తరువాత ఏమౌతాను, నేను ఈ జన్మలో ఏదైనా పనిచేస్తే ఆపని తాలూకు ఫలితం ఇతరజన్మలలో అనుభవించాలా అని అడుగుతున్నాడు. దీనికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఎందుకయ్యా, ఈ ప్రశ్నలు అన్నీ నీటైమువేస్టు, నా టైము వేస్టు అంటున్నారు. ఇప్పడు రాత్రి ౨ గంటలు అయ్యింది. ఇంకో గంటలో నీవు నిద్రలోనికి వెళతావు. నీకు నిద్రలో ఈ ప్రశ్నలు అన్నీ వస్తున్నాయా అని అడిగారు. నిద్రలో ఈ ప్రశ్నలు ఉండవు అని చెప్పాడు. నిద్రలో నీవు ఉన్నావు గాని నీవు అడిగే ప్రశ్నలు అక్కడలేవు. ఇప్పడు నీవు జాగ్రదవస్థలో ఉన్నావు. జాగ్రదవస్థలో ఈ ప్రశ్నలు వస్తున్నాయి కాని నిద్రావస్థలో ఈ ప్రశ్నలు లేవు. నీవు అప్పడు ఉన్నావు, ఇప్పడు ఉన్నావు అంటే నిద్రలో ఉన్న సుబ్బారాయుడు, మెలుకువలో ఉన్న సుబ్బారాయుడు వేరుకాదు, ఇద్దరూ ఒక్కటే. నిద్రలో ఉన్న వాడికి సంశయాలు లేవు, మెలుకువలోనికి వచ్చాక ఈ సంశయాలు వస్తున్నాయి. ఈ సంశయాలు కల్పించిన వాడి పిలక పట్టుకో అంతకంటే ఏమీ లేదు. ప్రశ్న మొదట్లో కట్ చేసారు. నిద్రలో ఈ ప్రశ్నలు ఎందుకు రావటం లేదు, జాగ్రదవస్థలో ఎందుకు వస్తున్నాయి. వాడు వీడు ఒక్కటే కదా. జాగ్రదవస్థలో ఈ ప్రశ్నలన్నీ ఎవరైతే కల్పిస్తున్నారో, ఏ అజ్ఞానం కల్పిస్తుందో దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు అప్పడు అంతానీవే, అప్పడు ఇంక నీకు రాకలేదు, పోకలేదు. భగవాన్ చెప్పినది అర్థం చేసుకోవటానికి నీకు సొంతబలం ఉండాలి. నీకు చావుగొడవ నిద్రలో ఉందా? లేదు. ఇప్పడు చావు గొడవ వస్తోంది. ఈ చావు గొడవ కల్పించేది ఎవరు? నీ అహంకారము కల్పిస్తోంది. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు ఏమీ లేదు. నువ్వు కల్పించిందే నీవు తొలగించుకో. నువ్వు ఏదైతే కల్పించుకొన్నావో అందులో నుండి బయట పడు అంతకంటే ఏమీ లేదు. ఈ ప్రశ్నలన్నీ ఎవరు కల్పిస్తున్నారో వాడిని తీసి ఒక ప్రక్కన పెట్టు ఏమీలేదు.

ఒకరాణిగారు భగవాన్‌ను అడుగుతున్నారు. మహారాజా! నేను ఎంతో కాలంనుండి మిమ్మల్ని చూడాలని అనుకొంటున్నాను. ఈ రోజున తమను చూసే భాగ్యం నాకు కలిగింది. నా నేత్రాలకు ఆనందం కలిగింది. నాకు బాహ్యంగా చూస్తే ఏమీలోటు లేదు, భౌతికమైన సంపదలు అన్నీ ఉన్నాయి. మానవుడు కోరదగినవన్నీ నాకు ఉన్నాయి కాని శాంతి మటుకు పెర్మనెంట్‌గా లేదు. బయటసంపద ఎంత పుష్కలంగా ఉందో లోపలశాంతి అంత పుష్కళంగా లేదు. అందరిలోను శాంతి సముద్రం ఉందని ఋషులు చెపుతున్నారు. అది నాలోనూ ఉండాలి కదా,

ఋషులు అబద్ధం చెప్పరు కదా, అయితే నాలో ఉన్న శాంతి పుష్కలంగా నాకు అందటం లేదు దానికి మీరేం చేస్తారు దానికి నా విధి కారణం అయి ఉండవచ్చు. నా హృదయంలో ఉన్నశాంతి సహస్రారానికి అందకుండా నా ప్రారబ్దం అడ్డువస్తోంది. దానికి మీరు మటుకు ఏమి చేస్తారు అని చెప్పి మౌనం వహించింది. భగవాన్ కూడా కొంతసేపు మౌనంగా ఉన్నారు. కొన్ని నిముషాలు గడిచిన తరువాత భగవాన్ ఆమెతో సరిసరి మీరు చెప్పవలసినదంతా చెప్పటం జరిగింది, మంచిదే. హృదయంలో ఉన్నశాంతి అందకపోవటానికి నా విధి కారణం అన్నారు. ఆవిధి ఎక్కడ ఉంది, ప్రారబ్దం ఎక్కడ ఉంది. అది లేనేలేదు. నువ్వు ఎవరు? నీవు చైతన్యం. చైతన్యానికి విధిలేదు, ప్రారబ్దం లేదు. ఈ విధి ఎవరికుందని నీవు అనుకొంటున్నావో వాడిని ఈశ్వరుడికి అర్పిస్తే విధి అనుభవించటానికి ఎవరు ఉన్నారమ్మా. అనుభవించేది శరీరం కాదు. శరీరంతో తాదాప్యం పొందే నేను అనుభవిస్తోంది. దానిని ఈశ్వరుడికి అర్పిస్తే విధిని అనుభవించే వారు ఎవరూ మిగలరు. శరణాగతి పొందిన వాడికి విధి, ప్రారబ్దం గొడవ ఏమీ లేదు. అంతా చక్కబడుతుంది అని చెప్పారు. నీ భారం నీవు మోయనక్కరలేదు, భగవంతుడి మీద నీ భారం వెయ్యి, ప్రపంచం బరువు మోసే వాడు నీ ఒక్కడి బరువు మోయలేడా. ఈశ్వరుడు సర్వసాక్షి మాత్రమే కాదు ఆయన సర్వశక్తిమంతుడు కూడా. నువ్వు ఏ బరువు మోయనక్కరలేదు నీ బరువు ఆయన మీద వెయ్యొచ్చు. నీ బరువు ఆయన మీద వేసినప్పుడు విధి, ప్రారబ్ధం, సంచితం, ఆగామి ఇవి ఏమి చేస్తాయి! అంటే భగవంతునికి శరణాగతి పొందమని చెపుతున్నారు. శరణాగతి పొందటం సాధ్యమవుతుందా, అది కష్టం కదా అని భగవానన్ను అడిగితే, ప్రారంభంలో శరణాగతి కష్టమే, చెయ్యగా చెయ్యగా అది సాధ్యమవుతుంది. నువ్వు పాక్షికంగా చెయ్యకలిగింది ఏదో చెయ్యి. అది పూర్ణ శరణాగతికి దారి తీస్తుంది.

మనం ఉన్నదానిని లేదు, లేదు అనుకొంటున్నాము. లేని దానిని ఉంది, ఉంది అనుకొంటున్నాము. ఉన్నదానిని ఉన్నట్లు నీవు అర్థం చేసుకొంటే లేనిదేదో లేనట్లు నీకు తెలుస్తుంది. అప్పుడు లోపల ఉన్న శాంతి నీకు అందుతుంది. విధివిధి అని కంగారుపడకు. విధి దొంగనేనుకేగాని నిజమైన నేనుకు విధి లేదు, ప్రారబ్ధం లేదు. ఈ గొడవలు అన్నీ దానికి అక్కరలేదు. అక్కడ ఉన్నది శాంతే శాంతి, సుఖమే సుఖము. వైకుంఠంలో ఉన్న సుఖం పొందటానికి నీ ముక్కులో గాలి బయటకు వెళ్ళే వరకు నీవు ఆగనక్కరలేదు. ఇప్పుడే ఇక్కడే నీవు పొందవచ్చు. నీకు ఏది అడ్డువస్తోంది. విధికాదు ఆవిధి ఎవరికుందో అది అడ్డువస్తోంది. దానిని తీసివేస్తే ఏమీలేదు. నువ్వు ఏమార్గంలో ప్రయాణం చేసినా పోగొట్టుకోవలసింది దానినే. పోగొట్టుకోవలసింది పోగొట్టుకొంటే ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. నాకు విధి ఉంది అనుకొంటున్నాను. దానిని త్రోసిపుచ్చవసిందేనా అని అడుగుతోంది. తప్పక త్రోసిపుచ్చవలసిందే అందులో నీవు రాజీపడనక్కరలేదు. విధి ఎవరు అనుభవిస్తున్నారు అని ప్రశ్నించుకో? నేను

అనుభవిస్తోంది. ఆనేను ఎవరు అని ప్రశ్నించుకో అప్పుడు వీడు మూలంలోనికి వెళతాడు. మూలంలోనికి వెళ్ళగానే యజమాని దొరుకుతాడు, వీడు పత్తాలేకుండా పోతాడు. నేను పూర్వజన్మలో చేసిన కర్మవలన కదా నాకు ఈ విధి వచ్చింది నేను దానిని ఎలా గెంటగలను అని అడుగుతోంది. ఎలా గెంటాలో ఈశ్వరుడు చూసుకొంటాడు ఆయనకు శరణాగతి పొందు. నీకు అసాధ్యం ఉండవచ్చు కాని ఈశ్వరుడికి అన్నీ సాధ్యమే. ఈశ్వరుడికి శరణాగతి పొందితే అన్నీ ఆయనే చూసుకొంటాడు. విధిని తీసివేయుటమే కాదు నీ అవసరాలను కూడ ఆయనే చూసుకొంటాడు. అనన్యభక్తి ఉన్నవాడు ఈశ్వరుడిని తప్ప ఇతర విషయాలను చింతించడు. ఎవడికైతే అనన్యభక్తి ఉందో వాడి యోగక్షేమములను భగవంతుడు చూస్తాడు. యోగం అంటే లేని దానిని ఇవ్వటం, క్షేమం అంటే ఉన్నదానిని పోకుండా కాపాడటం. ఈశ్వరదర్శనం కావాలి అని అడుగుతున్నారు. ఈశ్వరుడు నీ హృదయంలో చైతన్యంగా ఉన్నాడు. మనస్సుకు లోచూపు అలవాటు చేసుకో. మనస్సుకు ఎప్పుడైతే అంతర్ దృష్టి కలిగిందో లోపలఉన్న ఈశ్వరుడు తానుగా వ్యక్తమవుతాడు. ఈ ప్రశ్నలన్నీ ఎక్కడ నుండి వస్తున్నాయి. మనస్సునుండి వస్తున్నాయి. ఆ మనస్సే నువ్వు అనుకొంటున్నావు. మనస్సే నువ్వు అనుకొన్నంతకాలం ప్రశ్నలు వస్తూనే ఉంటాయి. నువ్వు అడుగుతూ ఉంటావు, నేను చెపుతూ ఉంటాను. సందేహించేవాడు లోపల ఉన్నంత కాలం సందేహాలు వస్తూనే ఉంటాయి. సందేహించేవాడు నశించాలి. ఎన్ని జన్మలు మనస్సుతో తాదాప్యం పొందినప్పటికి ఆ మనస్సు నువ్వు కాదు. అది నీవు కాకపోవటమే కాదు అది నిజం కూడా కాదు. ఏ మనస్సు అయితే నిజం అనుకొంటున్నావో దానిని విడిచిపెట్టగలిగితే, దానిని రిజక్టు చేయగలిగితే ఉన్నది చైతన్యమే. నాకు విధి అడ్డువస్తోంది అంటున్నావు విధి ఎక్కడ ఉంది. మనస్సులో ఉంది. నీ మనస్సును తీసికాల్చి బూడిదచేస్తే విధి ఎక్కడ ఉంది, ప్రారబ్ధం ఎక్కడ ఉంది, అన్నీ పోతాయి ఏదీ ఉండదు. మనస్సును తొలగించుకోవటం నీకు ఎందుకు కష్టం అవుతోంది అంటే మనస్సే నువ్వు అనుకొంటున్నావు. అదే నిజం అనుకొంటున్నావు. నువ్వు ఎన్నిసార్లు నిజం అనుకొన్నా అది నిజం కాదు అదే నిజమైతే గాఢనిద్రలో నిన్ను విడిచి పెట్టకుండా ఉండాలి. గాఢ నిద్రలో మనం ఏదైతే కాదో దానిలో నుండి సెపరేట్ అవుతాము. నీ లోపల ఉన్న చైతన్యం తప్పించి మిగిలినవన్నీ మనోకల్పితాలు. మనస్సే నిజం కానప్పుడు మనస్సు కల్పించినవి నిజం ఎలా అవుతాయి. ఒకవేళ నిజం అనుకొన్నా నీ మనస్సు ఎంతనిజమో అవికూడా అంతే నిజం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 3-7-2000, పెదనింద్రకొలను

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దైనందిన జీవితంలో మీరు చేసుకొనే పనులు శ్రద్ధగా చేసుకోవాలి. పని విడిచిపెట్టకూడదు. పనిమానివేస్తే జ్ఞానం రాదు, సోమరితనం వస్తుంది, తమోగుణం వస్తుంది. రజోగుణాన్ని,

తమోగుణాన్ని దూరంగా ఉంచి సత్వగుణాన్ని ప్రాక్టీసు చేసి సత్వగుణం సహాయంతో హృదయంలో ఉన్న బ్రహ్మంను పొందవచ్చును. అప్పుడు జన్మించటం, మరణించటం అనే చక్రంనుండి అంటే సంసారచక్రం నుండి విడుదల పొందవచ్చును. నేను వద్దని చెప్పిన పనిని విడిచిపెట్టి, నేను ఏపని చేయమని చెప్పానో ఆపని చేస్తూ ఉంటే పరిణామంలో సుఖపడతారు, మరణానంతరము మహావెలుగు ఉన్నలోకాలకు వెడతారు అని భగవంతుడు చెపుతున్నాడు. ఈ శరీరం చనిపోకముందే బ్రహ్మజ్ఞానము సంపాదిస్తే మీకు మోక్షం వస్తుంది అని చెప్పాడు. మనం అనేక విషయాలు కల్పించుకొంటున్నాము. కల్పించుకొన్న విషయాలకు కేంద్రం మన దేహమే. దేహాన్ని అదిష్టానము అన్నాడు. దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని మనం జీవిస్తే మనకు నరకం తప్పదు, జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటాము. మనపని మనం చేసుకొంటూ మోక్షాన్ని పొందేవిధానం చూసుకోవాలి. మనమాట, పని, మనస్సు నిర్మలంగా ఉండాలి. మేము వారికి సహాయం చేసాము, వీరికి సహాయం చేసాము అంటాము ముందు ఇటువంటి పిచ్చిమాటలు వదిలివేయండి అని వివేకానంద చెప్పాడు. సహాయం చేయటానికి నువ్వు ఎవరు? ఇలా అనుకోవటం వలననే అహంకారము పెరిగిపోతుంది, గర్వం పెరిగిపోతుంది. గుడికి వెళ్ళినపుడు అక్కడ డబ్బులు వేస్తాము. దేవుడికి ఉపకారం చేసాను అనుకోము. పూజ చేసాను అనుకొంటాము. అలాగ నీవు ఏది చేసినా పూజ చేసాను అనుకో, ఉపకారం చేసాను అనుకోవద్దు. అలా ఉంటే మనస్సు చల్లబడుతుంది. ఉపకారం చేసాను అనుకొంటే రజోగుణం, తమోగుణం పెరిగిపోతాయి. పూజ చేసాను అనుకొంటే నీకు సత్వగుణం వస్తుంది. సత్వగుణం మోక్షానికి దారిచూపిస్తుంది గాని మిగతా రెండుగుణాలు దారి చూపించవు. గుణాలకు కర్మకు సంబంధం ఉందిగాని గుణాలులేనివాడు కర్మచేసినా చెయ్యనివాడితో సమానము. నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా దొంగనేనులోనుండి బయటకురావాలి. దొంగనేను నీవు కల్పించుకొన్నావు అది నిజం కాదు. కల్పించుకొన్నావు కాబట్టి గురువు సహాయం ఉంటే దొంగనేనులోనుండి బయటపడగలవు. ముందుమనం సాత్వికబుద్దిని నేర్చుకోవాలి. మనమాట, చూపు, ఆలోచన అన్నీ సాత్వికంగా ఉండాలి. ఇతరులు మనపట్ల ఎలా వ్యవహరిస్తున్నారు అనేది అనవసరం. ఇతరుల పట్ల మనలను ఎలావ్యవహరించమని భగవంతుడు చెప్పాడో అలా చేసుకొంటూపోవాలి. ఇతరులపట్ల మీరు ఎలా వ్యవహరిస్తున్నారు అనేది భగవంతుడు చూస్తాడు. ఇతరుల పట్ల మీ బిహేవియర్ ఇంటెలిజెంట్‌గా ఉంటే, స్వీట్‌గా ఉంటే, నిర్మలంగా ఉంటే, ప్రేమగా ఉంటే అప్పుడు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు.

పెద్ద పంచదారరాశి ఉంది అనుకోండి. చీమ అందులో ఒక పంచదార కణం పట్టుకొని వెళుతుంది. ఆకణంతోటే దానికి కడుపు నిండిపోతుంది. అలాగే భగవంతుడిలో నేను ఆస్వాదించినది అంతే అంటే ఒక కణాన్ని తెచ్చుకొన్నాను అని వ్యాసుడు చెప్పాడు. అంటే భగవంతుని యొక్క వైభవం నాకు పూర్తిగా తెలియదని చెప్పటం. అన్నీ తెలిసిన వాడు కాబట్టి వ్యాసుడు అణిగి

ఉన్నాడు. మనకు ఏమీ తెలియదు కాబట్టి ఎగిరి ఎగిరి పడుతున్నాము. ఏదిపుణ్యము, ఏది పాపము అనే దానిగురించి వ్యాసుడు రెండు మాటలలో చెప్పాడు. కొంతమంది ఇతరులను మాటద్వారా, చూపుద్వారా, పనిద్వారా పీడిస్తూ ఉంటారు ఇది పాపం అని చెప్పాడు. ఇతరులకు నీవు చేయుగలిగిన సహాయం చేయుటం పుణ్యంఅని చెప్పాడు. పుణ్యం చేసినవాడు వెలుగున్నలోకాలకు వెళతాడు, పాపం చేసినవాడు చీకటి లోకాలకు వెళతాడు. మన డ్యూటీ మనం జాగ్రత్తగా చేయాలి. మన డ్యూటీ మనం జాగ్రత్తగా చేయుటంవలన పుణ్యంరాకపోయిన చేయకపోతే పాపం వస్తుంది. ఎదుటివాడు మాట్లాడినది అర్థం చేసుకోకుండా మనం మాట్లాడకూడదు. ఎదుటివాడు రజోగుణంతో మాట్లాడినా మనం సత్వగుణంతోనే మాట్లాడాలి. వాడురజోగుణంతో మాట్లాడుతున్నాడని నీవుకూడా రజోగుణంతో మాట్లాడితే నీవు భక్తుడవు ఎలా అనిపించుకొంటావు. వాడు ప్రకృతిలో ఉన్నాడు, నీవు ప్రకృతిలో ఉన్నావు. వాడు నువ్వు సమానమే. ప్రకృతిని దాటి వెళ్ళటానికి ఇంక నువ్వు ఏమీ ప్రయత్నం చేయటంలేదు. భగవంతుడు చాలా పరీక్షలు పెడతాడు ఎందుకంటే నీకు ఆధ్యాత్మికంగా ఎంతవరకు బలం ఉందో చూడటానికి పరీక్షలు పెడతాడు. ఆ పరీక్షలలో నెగ్గితే నీవు జీవన్ముక్తుడవు అవుతావు. ఆ పరీక్షలలో నెగ్గటానికి కూడా ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరుని మనం పొందలేము. నువ్వు గురువు ఋణం ఎలా తీర్చుకోవాలంటే గురువు చెప్పినమాటను కరెక్టుగా అర్థం చేసుకొని దానిని ఎంజాయ్ చేయగలిగితే గురువుయొక్క ఋణం తీరుతుంది అని వ్యాసుడు చెప్పాడు. మనకు తలంపు వచ్చినపుడు దానిని యాక్షన్‌లో పెట్టకూడదు. పెట్టకుండా ఉంటే అది పల్చబడిపోతుంది, యాక్షన్‌లో పెడితే అది బలపడుతుంది. మనకు ఎవరైనా మంచిచేస్తే జ్ఞాపకం పెట్టుకోవాలి, చెడ్డ చేస్తే మర్చిపోవాలి. దానివలన కూడా ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. కొంతమంది మనుషులు ఎలా ఉంటారంటే వారికి ౨౨ ఉపకారాలు చేసి ఒక్క అపకారం చేస్తే ఆ ౨౨ మంచి పనులు మర్చిపోయి ఈ ఒక్క అపకారం జ్ఞాపకం పెట్టుకొంటారు. ఇది తమోగుణం, రజోగుణం లక్షణం. ఆ లక్షణాలు తగ్గించుకోవాలి.

దేహం చనిపోయిన తరువాత నీవు ఇతరలోకాలకు వెళ్ళటం వలన అక్కడ సాధన సాగదు. ఇక్కడ ఈ భూమి మీద ఉండగానే మానవదేహంలో ఉండగానే ఆత్మజ్ఞాన సముపార్జనకు కృషి చేయాలి. ఇతరలోకాలకు వెళితే పుణ్యం ఉంటే సుఖము, పాపం ఉంటే దుఃఖం అక్కడ అనుభవిస్తావు. అక్కడ సాధనచేయటానికి నీకు అవకాశం లేదు. అందువలన మానవ జన్మను వృథా చేసుకోవద్దు, కాలాన్ని పాడుచేసుకోవద్దు. మానవజన్మ రావటం కష్టం. మానవజన్మ వచ్చినాగాని ముముక్షత్వం రావటం చాలా కష్టం. భక్తులందరూ ముముక్షువులు కాదు. ముముక్షువు ఎలా ఉంటాడంటే వాడు కూర్చొన్నా, తిరుగుతున్నా, జపం చేస్తున్నా, ధ్యానం చేస్తున్నా ఏది చేసినా ఈలోకానికి సంబంధించిన విషయాలుగాని, పరలోకానికి సంబంధించిన

విషయాలు గాని వాడి దృష్టిలో ఉండవు వాడికి మోక్షం తప్పించి ఇంక ఏమీ ఉండదు. ఈ జన్మలో మోక్షం సంపాదించాలి లేకపోతే ఆ ప్రయత్నంలోనైనా మరణించాలి తప్ప ఇతర గొడవలు వాడికి ఏమీ ఉండవు. ముముక్షువుకు మోక్ష కాంక్షతప్ప ఏదీ ఉండదు ఎందుచేతనంటే అది తప్ప ఏదీ పెర్మనెంట్ కాదని అతనికి తెలుసు. ముముక్షత్వం ఉన్నా దానికి సహకరించే గురువులు దొరకటం ఇంకాకష్టం. కనుక మానవజన్మను అంత తేలికగా తీసుకోవద్దు. కాలాన్ని పాడుచేసుకోవద్దు. మనోనాశనం అయ్యేవరకు ఏదో సాధన చెయ్యవలసిందే. అన్ని యోగాలను సమన్వయంచేసుకొని కృషిచేసి మోక్షాన్ని పొందవచ్చు. యోగాలన్నీ పరస్పరం సహకరించుకొంటాయి గాని, వాటికి విరోధం లేదు. జపం, ధ్యానం చేసేటప్పడు మొదట ప్రయత్నం ఉండాలి. కొంతకాలం చేయగా చేయగా నీ ప్రయత్నం అక్కరలేకుండా లోపల ధ్యానం జరిగిపోతుంది. నీ ప్రయత్నం లేకుండా జరిగే ధ్యానం మటుకుమూలం లోనికి తీసుకొనివెళ్ళి నీ సహజస్థితి ఎక్కడ ఉందో దాన్ని నీకు పట్టి ఇస్తుంది. ప్రయత్నం ప్రయత్నంలేని స్థితికి తీసుకొని వెళుతుంది. ద్వైతం, అద్వైతస్థితికి తీసుకొని వెళుతుంది. ప్రయత్నంలో బంధం ఉంటుంది. సాధన అనేది నిజంకాదు దానిని మనం కల్పించుకొని చేస్తున్నాము. ఎంతో కొంతసాధన చేస్తేగాని సాధనలేని స్థితికి వెళ్ళలేము. ఒకే తలంపు మీద మన మనస్సు సహజంగా ఉండే వరకు మనం జపం చేస్తూ ఉండవలసిందే, ధ్యానం చేస్తూ ఉండవలసిందే. అప్రయత్నంగా ఎప్పడైతే సాధన జరుగుతుందో సాధనచేసే సాధకుడు మనకు తెలియకుండా జారిపోతాడు. మొదట మీరు సాధన చేయకుండా ఉండలేరు మనస్సు ఉంది కాబట్టి. అదినశించిన తరువాత సాధన చేయాలన్నా చేయటానికి ఎవరూ ఉండరు. బయట ఉన్న అంతరాయాలు తేలిగ్గా పోగొట్టుకోవచ్చును గాని లోపల అంతరాయం అంటే అహంభావన పోగొట్టుకోవటం చాలా కష్టం. అది తొలగితేగాని నీకు సహజస్థితి కలుగదు. సహజస్థితి కలిగితేగాని నీకు సుఖం, శాంతి తెలియదు. మీరు ఎప్పడైనా మంచి మామిడిపండు తిన్నారు అనుకోండి ఆ వాసనలోపల ఉంటుంది. మరల అటువంటి మామిడి పండు ఎప్పడు దొరుకుతుందా అని కనిపెట్టుకొని ఉంటారు. అలాగే మీజీవితంలో ఎప్పడైనా ఒక్కసారి సహజస్థితిని కనీసం ఒక్క క్షణం అయినా అనుభవించి అందులోనుండి బయటకు వచ్చేసినా మరల ఆస్థితిని ఎప్పడు పొందుతామా అని ఎదురు చూస్తారు.

దేహంతో నీకు తాదాప్యం తగ్గాలంటే నిరంతరము భగవంతుని స్మరించుకొంటూ నువ్వు చేసే పని ప్రేమగా, భక్తిగా చేయాలి. మీరు ఎన్ని యోగాభ్యాసాలు చేసినా భక్తి లేకుండా వాసన నశించదు, భక్తిలేకుండా పునర్జన్మ హేతువులు నశించవు. నీకు రోగం ఉంది అనుకో. దానికి మందులు వేసుకొంటే అది తగ్గుతుందిగాని మందుపేరు నోటితో తలపెట్టుకోవటం వలన రోగం తగ్గదు. అలాగే నువ్వు మంచితనం గురించి, సత్యం గురించి వింటే సరిపోదు మంచిగుణాలను, సత్యాన్ని ప్రాక్టీసు చేయాలి. నీలోపల బ్రహ్మం ఉంది. దాని తాలుక అనుభవం లేకుండా నోటితో

అహంబ్రహ్మాస్మి అనుకోవటం వలన ప్రయోజనం లేదు. లోపల ఉన్న వస్తువు అనుభవంలోనికి వస్తే అప్పుడు చావులేని స్థితిని పొందుతావు. ఇక్కడ మనం జ్ఞానయజ్ఞం చేసుకొంటున్నాము. అన్నీ కాదు కనీసం కొన్ని మాటలు జ్ఞాపకం పెట్టుకొని జాగ్రత్తగా వాటిని మననం చేసి సొంతం చేసుకోవాలి. నీదేహంకంటే, ఇంద్రియాలకంటే, ఇంద్రియాలకు సంబంధించిన విషయాలకంటే, పంచకోశముల కంటే, మనస్సు కంటే అత్యంత దగ్గరగా ఉన్నది బ్రహ్మమే, నారాయణుడే. అంతదగ్గరగా ఉన్నాడు కాని వాడి వైపు నీ ముఖం త్రిప్పకపోతే, వాడిని స్మరించకపోతే, వాడిని అనుభవంలోనికి తెచ్చుకోవాలనే తపన నీకు లేకపోతే వాడు ఎంతదగ్గరగా ఉన్నా కోటిజన్మలు ఎత్తినా నీకు దూరంగానే ఉంటాడు. నీవు ఏ వస్తువును తెలుసుకోవాలనుకుంటున్నావో అది లేని కాలంగాని, దేశంగాని లేదు. అది నీలోపల ఉంది, బయట ఉంది, నీకూడానే ఉంది. అది నీవే అని తెలుసుకోవటానికే ఈ జపాలు, ధ్యానాలు, విచారణలు, సాధుసాంగత్యం. అంతటా ఉన్న వస్తువును తెలుసుకోవటానికి నీవు ఇల్లు విడిచి పెట్టనక్కరలేదు. ఇల్లు విడిచిపెడితే అది తెలియదు, బట్టలుమార్చుకొన్నా అది తెలియదు. నీ స్వభావం మార్చుకొంటే అది తెలుస్తుంది. నీ స్వభావం మార్చుకోమని నేను చెపుతాను కాని నా స్వభావం మార్చుకోను. తంటా అంతా ఇక్కడే ఉంది. నా స్వభావం నేను మార్చుకోవాలంటే దొంగ నేనుతో యుద్ధం చేయాలి. నీ స్వభావాన్ని మార్చుకోవటానికి నీవు ప్రయత్నం చేయవచ్చు. నీ ప్రయత్నం ఒక్కటే సరిపోదు నీ స్వభావం మారాలంటే ఈశ్వరానుగ్రహం ఉండాలి.

భగవంతునికంటే మన క్షేమం కోరేవారు ఈ సృష్టిలో ఎవరూ లేరు. భగవంతుని మాటలతో రాజీపడు. భగవంతుని మాటలు నీకు ఇష్టం లేకపోయినా హితవు చేసుకో ఎందుచేతనంటే మనకు తెలియని విషయంకదా భగవంతుడు చెప్పేది. భగవంతుని మాటలను గౌరవించు. భగవంతుని ప్రేమించు, ఎప్పడైతే ఈశ్వరుని మీద ప్రేమ పెంచుకొంటున్నావో నీలోపల ఉన్న గుణాలు వాటి అంతట అవేపోతాయి. మనస్సు పక్వానికి వచ్చినపుడు ఇంట్లో ఉన్నా, అడవిలో ఉన్నా, ఆశ్రమంలో ఉన్నా జ్ఞానం వస్తుంది. అప్పటి వరకు నీవు చేసేపనిగాని, ఇల్లుగాని విడిచిపెట్టవద్దు. నీ మనస్సు పక్వానికి రాకుండా ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోతే, నువ్వు చేసేపని వదిలివెళ్ళిపోతే అలా జ్ఞానం రాదు. అప్పడు ఇహానికి పనికిరావు, పరానికి పనికిరావు. నీవు చేసేపని శ్రద్ధగా చెయ్యి, భక్తిగా చెయ్యి. నీ మనస్సు ముగ్గిపోతే సహజంగా దేహంతో విడిపోతావు, నీకు జ్ఞానం కలుగుతుంది. మీ గురించి మీకు సరియైన అవగాహన ఉండాలి. సాధనలో అది ముఖ్యం. ఈశ్వరానుగ్రహం పొందాలి అనే తపన ఉండాలి, మానవజాతి మీద అనురాగం ఉండాలి గాని గృహస్థాశ్రమం, సన్యాసాశ్రమం అనేది ముఖ్యం కాదు. ఉన్నది లేదు అనుకొన్నా ప్రమాదమే, లేనిది ఉంది అనుకొన్నా ప్రమాదమే. అందువలన మీకు సంబంధించినంత వరకు కరెక్టు అండర్‌స్టాండింగ్ అవసరము. లోపల ఆధ్యాత్మిక శక్తి పెంచుకొంటూరావాలి, పైకి అందరిలాగే మామూలుగా ఉండాలి. అవినయం

రాకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. పొలాన్ని దున్ని ఊడ్చమని చెపుతారు. అప్పడు సమానంగా ఉండి పంట బాగా పండుతుంది. అలాగే నీ మనస్సులో ఉన్న హెచ్చుతగ్గులను దున్ని సమానం చెయ్యాలి అప్పడు ఆత్మ జ్ఞానం కలుగుతుంది. అది జ్ఞాన పంట.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 16-7-2000, జిన్నూరు, గురుపూర్ణిమ**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు వ్యాసపూర్ణిమ. వ్యాసపూర్ణిమనే సాంప్రదాయంలో గురుపూర్ణిమ అని పిలుస్తారు. గురువుయొక్క కృపను పొందటం కోసం ఈ రోజున గురువును పూజిస్తారు. మనకు ఎవరైతే ఆత్మవిద్యను భోధిస్తారో వారిని గురువు అంటాము. అసలు గురువు అంటే తాను ఆత్మానుభవం పొందవలె. ఎప్పడైతే ఆత్మానుభవం కలిగిందో అప్పడు పరమశాంతి కలుగుతుంది. అది శాశ్వతమైన శాంతి. శాంతి వల్ల శక్తి కలుగుతుంది. ఆ శక్తిని సమాజమునకు ఉపయోగించవచ్చు. మనకు శక్తిలేకపోతే సమాజమునకు ఏమీ ఉపయోగపడలేము. నా గురువు ఎవరో నాకు ఎలా తెలుస్తుంది అని అడుగుతున్నారు. ఎవరి సమక్షంలో నీకు శాంతి కలుగుతుందో, వాసనాక్షయం అవుతుందో, ఎవరి సమక్షంలో నీ ప్రయత్నం లేకుండా నీకు అంతర్‌దృష్టి కలుగుతుందో, నీ మనస్సు నిర్మలమవుతుందో, నీ మనస్సు ఏకాగ్రం అవుతుందో వాడే నీ గురువు. అలా నీకు తెలియకపోయినా ధ్యానం చేసినా నీ గురువు ఎవరో నీకు తెలుస్తుంది. నీ మనస్సును భగవంతుని వైపుకు మళ్ళించేవాడే గురువు. గురువు అన్నా, ఆత్మ అన్నా, చైతన్యం అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే. ఇవి అన్నీ పర్యాయపదాలు. నిజమైన గురువు ఏమిచేస్తాడు అంటే తాను పొందినది ఇతరులచేత కూడా పొందింపజేయటానికి సహకరిస్తాడు. ఏ శాంతి అయితే తనకు అనుభవంలో ఉందో ఇతరులను ఆస్థితికి తీసుకొనివెళ్ళటం కోసం గురువు సహకరిస్తాడు. గౌతమబుద్ధుడు చేసిన ప్రయత్నం ఏమిటంటే తానుదుఃఖం లేని స్థితిని పొందాడు, ఆ స్థితికి ఇతరులను తీసుకొని వెళ్ళటం కోసం తన జీవితం పొడుగునా కృషి చేసాడు. సాధకుడు ముఖ్యంగా ఏమి చేయాలంటే గురువు పట్ల, ఈశ్వరుని పట్ల గౌరవం కలిగి ఉండాలి, భక్తి కలిగి ఉండాలి. సాధకుడికి ఎవరిపట్ల శత్రుత్వం లేకుండా ఉండేటట్లు చూడమని ఈశ్వరుని భక్తుడు ప్రార్థిస్తాడు ఇది యజుర్వేదంలో మాట. ఎవరి పట్ల నీకు శత్రుత్వం ఉన్నా నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఇష్టం ఉన్నా, అయిష్టం ఉన్నా మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనస్సు బాహ్యముఖానికి రావటానికి కారణం రాగద్వేషములు. నువ్వు రాగద్వేషములకు దూరమైతేగాని నీకు అంతర్‌దృష్టి కలుగదు. రాగద్వేషముల వలన మనస్సు బాహ్యముఖం అవుతోంది కాబట్టి రాగద్వేషములు లేకుండా నన్ను అనుగ్రహించమని యజుర్వేదంలో భక్తుడు ఈశ్వరుని ప్రార్థిస్తాడు. ఏ కారణములవలన మనస్సు బాహ్యముఖానికి వెళుతోందో నువ్వు పరిశీలించుకొని ఆ కారణములు తొలగించుకొంటే నీ మనస్సు

బాహ్యముఖానికి వెళ్ళదు. కొంతమంది ఆత్మానుభవం పొందుతారు కాని వారు పొందిన అనుభవాన్ని ఇతరులకు వ్యక్తం చేయలేకపోవచ్చు. వాడు ఆత్మానుభవం పొంది తను పొందిన విషయాన్ని ఇతరులకు వ్యక్తం చేయగలగాలి వాడు గురువు. అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి నిన్ను విడుదల చేయటానికి సర్వవిధముల నీకు సహాయసహకారములు అందించేవాడే గురువు. అజ్ఞానదశ నుండి జీవుడిని విడుదలచేయటానికి సర్వవిధముల ప్రయత్నం చేసేవాడు గురువు. నీకు ముముక్షత్వం ఉంటే, జ్ఞాన సముపార్జన చేయాలనే కాంక్ష ఉంటే అప్పుడు గురువు యొక్క ప్రాముఖ్యత నీకు తెలుస్తుంది. సామాన్య మానవుడు ఆత్మశాంతిని, జననమరణములు లేని స్థితిని కోరుకోడు ఎందుచేతనంటే మోక్షం యొక్క విలువ, శాంతి యొక్క విలువ వాడికి తెలియదు. వాడికి ఉన్న కోరికలను నెరవేర్చమని భగవంతుని ప్రార్థిస్తాడు. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే వాడిని తెలుసుకొనే దశవచ్చే వరకు, చైతన్యం గురించి తెలుసుకొనే దశ వచ్చే వరకు వాడికి ఒకో కోరిక, ఒకో కోరిక నెరవేరుస్తూ ఉంటాడు. వాడు ఈశ్వరుడు. నీ కోరికలు నెరవేర్చటం ఆయన ధ్యేయం కాదు నీకు తగిన అర్హత తీసుకొని రావటం కోసం ఇవి అన్నీ చేస్తాడు. నీ మనస్సును పరిశుద్ధపరుస్తూ ఉంటాడు.

నువ్వు ఏరకంగా పనిచేస్తే ఆపని నిన్ను బంధించదో అలా చేయటం ప్రవీణత అదే స్కిల్ అని భగవంతుడు చెప్పాడు. ఎవరైనా బాగాచేస్తే అది స్కిల్ అంటాము. అది కాదు. పని వలన ఫలితం వస్తుంది. ఆ ఫలితం వలన బంధింపబడకూడదు. నువ్వు చేసిన పని వలన నీవు బంధింపబడకుండా ఉండగలిగితే అది నేర్పు అని గీతలో చెప్పాడు. ఆ స్కిల్ నీవు సంపాదించాలి. అది సంపాదిస్తే నీకు పవిత్రత కలుగుతుంది. భగవంతుడు స్లోగా, స్టెడీగా వర్కు చేస్తాడు. మన చేనులో నీరు లేదు అని కాలువకు గండి కొడితే ఏమౌతుంది. చేను అంతా మునిగిపోయి పంట నాశనం అవుతుంది. చేనుకు ఎంత నీరు కావాలో అంతే పెట్టుకోవాలి. అలాగే భగవంతుడు ఏమిచేస్తాడు అంటే తన దగ్గర ఎంత అనుగ్రహం ఉన్నా నువ్వు ఎంతవరకు జీర్ణం చేసుకోగలవో, నీకు ఎంత వరకు అర్హత ఉందో అంత వరకు అనుగ్రహాన్ని నెమ్మదిగా పంపుతాడు. నువ్వు కంగారు పడనక్కరలేదు. ఒకేసారి అతిగా పంపుతాడు అనుకో నువ్వు తట్టుకోలేవు అందువలన మనకు ఎంతవరకు అర్హత ఉందో అంతవరకే పంపుతాడు. మనందరము తరిస్తాము అందులో సందేహం లేదు. మనందరము ట్రైనులో కూర్చొన్నాము. గమ్యం చేరటానికి ఒక గంట వెనుకో, ముందో పడుతుంది. మీకు అందరకు ఎంతో కొంత భక్తిలేకపోతే ఈ సమావేశాలకు రారు. కోరికలతో ఉన్న భక్తికూడా భక్తే అని భగవంతుడు చెప్పాడు. ఆర్తులు, అర్థార్థి, జిజ్ఞాసువు, జ్ఞాని అని చెపుతారు. జ్ఞానిని కూడా భక్తుడు క్రిందే చెప్పాడు. అయితే అతనిది ఏకభక్తి, అనన్య భక్తి. భక్తుడికి అన్నీ కావాలి, దేవుడూ కావాలి కాని జ్ఞానికి దేవుడు తప్పించి ఇంక ఏమీ అక్కరలేదు. జ్ఞాని ప్రపంచంలో ఉంటాడు ప్రపంచంలేని స్థితి వాడికి అనుభవంలో ఉంటుంది. ప్రపంచంలో ఉండి నిష్ప్రపంచస్థితిని

లోపల ఎంజాయ్ చేస్తూ ఉంటాడు. జ్ఞాని భగవంతుడి స్వరూపాన్ని పొందుతాడు. తనకంటే భిన్నంగా ఏదీ ఉండదు. నువ్వు భగవంతుడిని ప్రార్థించగా, ప్రార్థించగా ఈశ్వరుడి కృప రూపం దాల్చుతుంది వాడే గురువు. మామిడిపండులో టెంక, పైన తొక్క, పీచు, రసం అన్నీ ఉంటాయి. ఇది అంతాకలిపి భగవంతుడు. మామిడిపండులో ఉన్న రసం రూపందాల్చితే వాడే గురువు. నువ్వు ఏదైనా పొరపాటు చేస్తే దేవుడు శపించవచ్చు, నిన్ను శిక్షించవచ్చు, కాని గురువు నిన్ను శపించడు. శపించటానికి తగిన కారణములు ఉంటే ఆకారణములనుండి నిన్ను విడుదలచేస్తాడు కాని నిన్ను శిపించడు వాడు గురువు. ఈశ్వరుడి కంటే గురువుకు అగ్రస్థానం ఇచ్చారు. భగవంతుడు జడ్జిమెంట్ చెప్పవచ్చు. గురువు జడ్జిమెంట్ చెప్పడు, నిన్ను రక్షించటమే పని. నిన్ను అహంభావనలోనుండి, దేహగతమైన నేనులోనుండి విడుదలచేసే ప్రయత్నం తప్పించి జడ్జిమెంట్ జోలికి వెళ్ళడు. నీలో ఉన్న పునర్జన్మ హేతువుల నుండి నిన్ను విడుదల చేయటమే గురువుపని కాని నిన్ను శిక్షించటం గురువు పని కాదు. ఈశ్వరుడిలో ఉన్న కరుణ నీకోసం కాళ్ళు చేతులు తొడుక్కొని గురురూపం దాల్చి వస్తుంది. గురువు నీకు దూరంగా ఉండడు. నీ కూడానే ఉంటాడు. నీతో కలిసి తిరుగుతాడు, మాట్లాడతాడు నీకు తెలియకుండా నీ మనస్సును నిర్మలం చేస్తాడు, ఏకాగ్రం చేస్తాడు, పవిత్రం చేస్తాడు వాడు గురువు. నీలో ఉన్న బలహీనతలు గురువుకు తెలుస్తూ ఉంటాయి. వాడు అంతర్యామి, వాడు బయట ఉన్నాడు, లోపల ఉన్నాడు, అందరి హృదయాలలో ఉన్నాడు. నీకు తెలియకుండా నీలో ఉన్న బలహీనతలను తొలగిస్తాడు వాడు గురువు. నీ మొఖం నలగకుండా నీకు సర్జరీ చేస్తాడు. సాధన పేరు మీద నిన్ను బాధలకు గురి చేయడు. నీ బాధలు ఏవో నీకు ఉన్నాయి. సాధన పేరుమీద నీ బాధలు పెంచడు, ఆయన సాన్నిత్యం మీకు ఇస్తూ మీ మనస్సు నిర్మలం చేస్తాడు. నీకు తెలియకుండా నీ మనస్సును హృదయాభిముఖంగా మళ్ళిస్తాడు. ఆచేసే ప్రక్రియలో ఎక్కడకు తీసుకొని వెళుతున్నాడో నీకు కూడా తెలియదు. అమృతానుభవం కలిగేవరకు మానవుడికి భయం కలుగుతుంది. అమృతానుభవం కలిగితేగాని భయం నశించదు. అందుచేత అమృతానుభవం కలిగేవరకూ గురువు విడిచిపెట్టడు. కొంతమంది ప్రతీచిన్న విషయానికి భయపడిపోతారు. నీకు వీక్ మైండ్ ఉంది అనుకో దానిని స్ట్రాంగ్ మైండ్ చేస్తాడు. అంటే దేహవాసన గాని, లోకవాసన గాని, శాస్త్రవాసనగాని వచ్చి మిమ్మల్ని తడుతున్నప్పటికి వాటిని నిరోధించే శక్తి కలుగజేస్తాడు. ప్రపంచంలో ఎన్ని విషయాలు ఉన్నప్పటికి, ఎన్ని ఆకర్షణలు ఉన్నప్పటికి వాటికి నీ మనస్సు లోనుకాకుండా నిరోధించే శక్తిని నీకు గురువు ఇస్తాడు. నీ వీక్ మైండ్‌ను స్ట్రాంగ్ మైండ్ చేసి లోపలకు విత్‌డ్రా చేస్తాడు. అమృతానుభవం కలిగే వరకూ మనస్సును లోపలకు తోలుకొని వెళతాడు వాడు గురువు. ఇది అంతా నీకు తెలియకుండా చేస్తాడు.

నీ కంట్రోలర్ నీ హృదయంలోనే ఉన్నాడు. వాడు మనస్సుకు, మాటకు, తలంపుకు, మిథ్యానేనుకు అందనే అందడు. ఎక్కడైతే మనస్సు శేషం లేకుండా నిశ్శేషంగా అణిగిందో అక్కడ

అమృతానుభవం కలుగుతుంది. మనస్సును అలాగే ఉంచుకొని మనస్సుతో ఈశ్వరుని గ్రహించాలంటే కోటి జన్మలు ఎత్తినా అది సాధ్యం కాదు. మనం ఆత్మస్థానంలో అహంభావనను పెట్టాము. నేను అనేటప్పటికి మనకు ఆత్మ గుర్తుకు రాదు, అహంభావన గుర్తుకు వస్తుంది. అహంభావనను, మనస్సును తీసుకొని వెళ్ళి చైతన్యం యందు ఆరోపిస్తున్నాము. ఈ ఆరోపణ బుద్ధిపోతే ఇక్కడే ఇప్పుడే అమృతానుభవం కలుగుతుంది. కొంతమంది పనిచేస్తూ ఉంటారు. ఆపనివారికి ఉపయోగపడదు, సమాజానికి ఉపయోగపడదు, దేవుని అనుగ్రహం పొందటానికి ఉపయోగపడదు. మరి ఎందుకు ఆ పని చేస్తున్నట్లు దేనికో ఒకదానికి ఉపయోగపడాలి కదా. పనికిరాని విషయాలు అన్నీ దెయ్యాలు, పనికి వచ్చే విషయం దేవుడు. మనం ఇప్పుడు దెయ్యం చేతిలో ఉన్నాము. దెయ్యం చేతిలో ఉండి దేవుడుని కోరుకొంటున్నాము మనకు దేవుడు ఎలా కనిపిస్తాడు. దెయ్యంలోనుండి విడుదల పొందటానికే మనం చేసే సాధన. దానికి గురువు అనుగ్రహం అవసరం. గురువు అనుగ్రహం లేకుండా చిన్న బలహీనతలోనుండి కూడా బయటకు రాలేము. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వర కటాక్షం. ఎంతో కొంత ప్రయత్నం చెయ్యి, కాలం కలిసివస్తుంది, ఈశ్వరానుగ్రహం నీ శిరస్సు మీద వర్షిస్తుంది. అప్పుడు ఈ బలహీనతల నుండి బయటకు వస్తావు. దెయ్యం చేతిలోనుండి ఎప్పుడైతే బయటకు వచ్చావో అప్పుడు ఈశ్వరుడు నీకు వ్యక్తమవుతాడు. నేను ఈ శరీరానికి పరిమితమై ఉన్నాను అనుకోండి. నేను వేరు, మీరు వేరు అనుకొంటాను. కాని ఈ ఉపాధిలన్నింటికి ఉపాధి ఎవడు భగవంతుడు. అది జ్ఞానికి తెలుస్తూ ఉంటుంది. జ్ఞాని ఈ ఉపాధులను చూస్తున్నప్పటికి లోపల భగవంతుడినే చూస్తూ ఉంటాడు అందుచేత వాడికి ఇతరులు లేరు.

మా పూర్వజన్మల గురించి చెప్పమని భగవాన్‌ను అడిగేవారు. ఈ జన్మలో దుఃఖమే భరించలేకపోతున్నారు. పూర్వజన్మల గురించి చెప్పమంటే చెపుతాను. ఈ బరువే మోయలేక పోతున్నారు ఇంక ఆ బరువు కూడా ఎలా మోస్తారు, ఆ దుఃఖం కూడా ఎందుకు అనేవారు. ఈశ్వరుడు దయా స్వరూపుడు కాబట్టి గతజన్మ మరుపు పెట్టాడు. ప్రస్తుతం ఉన్న దుఃఖమే భరించలేకపోతున్నారు గతజన్మ దుఃఖం దీనికి కలిస్తే బరువు పెరుగుతుంది. ఈజన్మలు అన్నీ అసత్యమే, ఇవి అన్నీ వ్యవహారిక సత్యమే. ఎందులోనుండి విడుదల పొందాలో అది చూసుకోండి కాని గతజన్మల గొడవ అనవసరం. అజ్ఞానదశలో ఉన్నారు కాబట్టి ఇవి అన్నీ నిజం అనుకొంటున్నారు. అజ్ఞాన దశలోనుండి ఒక్కసారి జ్ఞానదశలోనికి వస్తే ఇది అంతా స్వప్నమే అని మీకు తెలుస్తుంది ఇతరులు మీకు చెప్పవలసిన పనిలేదు. దుఃఖకారణం బయటలేదు. అత్తగారి వలన దుఃఖం వస్తోంది, భర్త వలన దుఃఖం వస్తోంది, పొరుగువారి వలన దుఃఖం వస్తోంది అనుకొంటాము, దుఃఖ కారణం బయట లేదు, లోపలే ఉంది. మమకారం వలన దుఃఖం వస్తోంది. ఇతర మనుషులతో నీకు ఉన్న సంబంధం, లోకంతో నీకు ఉన్న సంబంధం, పరిస్థితులతో నీకు

ఉన్న అనుబంధం వలన నీకు దుఃఖం వస్తోంది. గురువు ఏమి చేస్తాడు అంటే నీకు ఎవరి మీద అయితే మమకారం ఉందో సడన్‌గా వారిచేత తిట్టిస్తాడు ఎందుచేతనంటే మమకారం పోవటానికి అలా చేస్తాడు. మమకారం పోతేగాని మనస్సు లోపలకు వెళ్ళదు. బయట గురువు చేసే పని చాలా ఉంది. నిన్ను తలుపుసందున పెట్టి నొక్కుతాడు అంటే గురువుకు మీరంటే ఇష్టం లేకకాదు మీ మనస్సును ప్రిపేర్ చేయటానికి, పవిత్రత కలుగ చేయటానికి అలా చేస్తాడు. బాహ్యాముఖానికి వెళుతున్న నీ మనస్సును బయట గురువులోపలకు గెంటుతాడు, లోపల గురువు ఏమి చేస్తాడు అంటే వాడి చేతికి అందేకా హృదయ గుహలోనికి లాగేస్తాడు.

గాఢ నిద్రలో నీవు ఏదైతే కాదో దానిలో నుండి విడిపోతున్నావు. కాని గాఢ నిద్రలో నీవు ఉన్నావు. గాఢ నిద్రలో మనస్సునుండి విడిపోతున్నావు, దేహం నుండి విడిపోతున్నావు, ప్రపంచం నుండి విడిపోతున్నావు. అక్కడ నీకు జన్మల గొడవ, లోకం గొడవ, దేవుడు గొడవ లేదు, ఏ గొడవ లేదు సుఖంగా శాంతిగా ఉన్నావు. అది నిజమైన స్థితి. గాఢ నిద్రలో ఉన్న స్థితి జాగ్రదవస్థలోకూడా ఉంది. గాఢ నిద్రలో ఉన్న స్థితిని జాగ్రదవస్థలో పొందటానికి నీకు సహాయ సహకారములు అందించే వాడే గురువు. అది నీకు ప్రత్యేకంగా గురువు సంపాదించి పెట్టనక్కరలేదు. సహజంగానే ఆస్థితి ఉంది. ఆ స్థితితో నీవు తాదాప్యం పొందటానికి గురువు నీకు సహకరిస్తాడు అది గురువు చేసేపని. నీలో ౨౨ మంచి గుణాలు ఉన్నాయి అనుకో. ఒక్క చెడ్డగుణమే ఈర్ష్య ఉంది అనుకో. ఈ ఈర్ష్య అనే ఒక్క చెడ్డ గుణం మిగతా ౨౨ మంచిగుణాలను తినేస్తుంది. ఈర్ష్య అంత బలీయంగా ఉంటుంది. అందువలన చాలా జాగ్రత్తగా ఉండండి, ఈర్ష్య రాకుండా చూసుకోండి అని మహ్మద్ ప్రవక్త చెప్పారు. నీకు రాంగ్ తింకింగ్ వలన దేహంతో తాదాప్యం వస్తోంది. నీలో ఉన్న రాంగ్ తింకింగ్‌ను తీసివేసి దాని స్థానంలో రైట్ తింకింగ్ స్థాపించాలి. రైట్ తింకింగ్, రైట్ స్పీచ్, రైట్ లివింగ్, రైట్ బిహేవియర్ ఇది అంతాకలిపి ధర్మం అంటున్నాము. దీనిని ఆచరిస్తే నీకు తెలియకుండా అమృతానుభవం కలుగుతుంది. మనం ఏదైనా ఒకపని చేసేటప్పుడు అది అవసరం ఉండి చేస్తున్నామా అహంభావనకోసం చేస్తున్నామా అని దైనందిన జీవితంలో పరిశీలన చేసుకోవాలి. ఏదైనా ఒకమాట మాట్లాడుతున్నాము అనుకోండి అది అవసరం ఉండి మాట్లాడుతున్నామా, అహంభావన బట్టి వస్తోందా అని చూసుకోవాలి. అహంభావన వలన ఆ మాటవస్తే వెంటనే మాటను ఆపేయాలి, క్లోజ్ యువర్ మౌత్ లేకపోతే అహంభావన పెరిగిపోతుంది. గురువు అంతరంగంలో ఉండి ఏ బలహీనత అయితే నీలో ఉందో దానిని తొలగించటానికి ప్రయత్నం చేస్తూ రైట్ తింకింగ్‌లోనికి ప్రవేశపెట్టటానికి నీకు తెలియకుండా గురువు లోపల పని చేస్తాడు. నిన్ను బాగుపడమని గురువు పైకి చెప్పడు. లోపల ఉండి పనిచేస్తూ నిన్ను బాగుచేస్తాడు వాడు గురువు. నీ హృదయంలో నుండి నేను అనే తలంపు వస్తోంది. దాని నుండి ఇతర తలంపులు వస్తున్నాయి. మిగతా తలంపుల నుండి ఆ మొదటి

తలంపును వేరుచేసి ఆమూలతలంపును పట్టుకొని అది ఎక్కడ నుండి వస్తోందో చూస్తూ ఆమూల తలంపు ఉదయించిన చోటుకు వెడితే అది నశిస్తుంది. అప్పడు మూలతలంపుకు ఏదైతే ఆధారంగా ఉందో అది నీకు వ్యక్తమవుతుంది. అదే నీ స్వరూపము. దానికి చావులేదు, పుట్టుక లేదు.

ఇప్పుడు మనం దేహంతో కలిసి ఉంటున్నాము, మనస్సుతో కలిసి ఉంటున్నాము. ఆత్మకంటే అనాత్మగొడవలో ఎక్కువగా ఉంటున్నాము. ఈ అనాత్మను తీసుకొని వచ్చి నేనే అనుకొంటున్నాము. మనం ఏమి చేయాలంటే హృదయంలో స్థిరంగా ఉండటం నేర్చుకోవాలి. మూలతలంపు ఎక్కడ నుండి అయితే వచ్చిందో అక్కడ స్థిరంగా ఉండగలిగితే అదే భక్తి, అదే జ్ఞానం, అదే యోగం. జపం చేసినా, ధ్యానం చేసినా నీవు మనోమూలంలోనికి వెళ్ళగలగాలి. మనోమూలం లోనికి వెళితేనేగాని మనస్సు నశించదు. నువ్వు ఏదో సాధన చేస్తూ ఉంటావు మళ్ళీ పడిపోతూ ఉంటావు. ఏకారణం వలన నువ్వు పతనమవుతున్నావో గురువు చూస్తూ ఉంటాడు. ఆ బలహీనతలనుండి నిన్ను సెపరేట్ చేస్తాడు, ఆ బలహీనతలను బరన్ చేస్తాడు వాడే గురువు. నువ్వు సమానదృష్టిని అలవర్చుకో, దానివలన మనస్సు పల్చబడుతుంది. నిన్ను గౌరవించేవారిని ఎక్కువగా, గౌరవించని వారిని తక్కువగా చూస్తావు. ఆబుద్ధిని విడిచిపెట్టు. అందరిని సమానంగా చూడు. ఎవరింటికి వెళ్ళినా మన ఇంటికి వెళ్ళాము అనుకోవాలి, ఏదేశం వెళ్ళినా మన దేశమే అనుకోవాలి. దీనివలన సాత్విక బుద్ధి పెరుగుతుంది. కొంతమందికి ఇల్లు విడిచిపెడితే నిద్ర పట్టదు. అది మంచిది కాదు. ఒక ప్రదేశం మీద ఎటాచ్‌మెంట్ ఉండకూడదు. సత్వగుణం నేచురల్‌గా ఉంటే సరేసరి లేకపోతే నేర్చుకో. నిరంతరము అరుణాచలాన్ని స్మరించటం వలన అహంకార బుద్ధి నశిస్తుంది. నువ్వు ఏదైతే కాదో దానిని స్మరించకు. ఏది అయితే అవునో దానిని స్మరించటం వలన దానికి దగ్గరవుతావు, కాని దానికి దూరమవుతావు. ఆ ప్రక్రియకు గురువు సహాయం అవసరం, నువ్వు చేసేపని అయిష్టంగా చేయకు, ఇష్టంగా చెయ్యి ఇది ఒక్కటీ నేర్చుకొంటే సరిపోతుంది. దేహాభిమానం ఉన్నంతకాలం మనం పనిచేయకుండా ఉండలేము. మనం చేసేపని ఇష్టంగా చేయాలి. అలా ఇష్టంగా చేసే పనే మనకు దైవానుగ్రహం సంపాదించిపెట్టాలి. సింహాన్ని చూసి జంతువులు ఎలా పారిపోతాయో నారాయణ స్మరణవలన విషయాలు అలా పారిపోతాయి. మామిడి పండు అంతా కలిసి దేవుడు, అందులో ఉన్న రసం మాత్రం గురువు. ఇది గుర్తుపెట్టుకోండి. సీక్‌నాట్, ఎవాయిడ్ నాట్ అంటే దేనిని అపేక్షించవద్దు, దేనిని తప్పించుకోవద్దు.

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా